సాక్షి
కాకినాడ
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



ఆలయానికి విరాళం


ఆలమూరు: చింతలూరు నూకాంబిక ఆలయానికి ముత్యాల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం కుమార్తె, అల్లుడు యడ్లపల్లి సత్యనారాయణ దంపతులు (మోదుకూరు) రూ.1,01,116 సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.1,11,521

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వేటుకూరి శ్రీరామరాజు (అమలాపురం) ఆదివారం రూ.1,11,521 విరాళం అందజేశారు.

8,500 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 4,300 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.55 అడుగులుగా ఉంది.

కనకధార కురవాలని!

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పన
- రూ.162.55 కోట్లతో ప్రతిపాదనలు
- ఆర్థిక ఇబ్బందుల ప్రభావం
- ఖర్చుల్లో భారీగా కోత
- వ్యయం అంచనా రూ.162.13 కోట్లు

అన్నవరం: అనంతలక్ష్మీ సత్యవతీదేవి సమేతుడై భక్తులు కోరిన కోరికలు తీరుస్తున్న అన్నవరం సత్యదేవునిపై ఎందువల్లనో కానీ కొంత కాలం నుంచి లక్ష్మీ కటాక్ష వీక్షణాలు పూర్తి స్థాయిలో ప్రసరించడం లేదు. దీంతో దేవస్థానం ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతోంది. అన్నవరం దేవస్థానం ఆర్థిక ఇబ్బందులపై 'సాక్షి' గత డిసెంబర్ 30న 'లక్ష్మీ.. రావా.. రత్నగిరికి' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన కార్యనిర్వహణాధికారి (ఈఓ) వీర్ల సుబ్బారావు దేవస్థానం ఆదాయం పెంచేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని అధికారులను, సిబ్బందిని కోరారు. దీనిపై 'ఆదాయ మార్గాలు చెప్పండి' శీర్షికన 'సాక్షి' జనవరి 28న వార్త ప్రచురించింది. కాగా, ఆదాయం మూరెడు.. ఖర్చు బారెడు అనే రీతిలో ఉన్న దేవస్థానాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించి, పూర్వ వైభవం తీసుకుని వచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌కు రూపకల్పన చేశారు.

గత ఏడాదితో పోల్చితే ఈసారి బడ్జెట్ ప్రతిపాదనల్లో ఖర్చులు తగ్గించి, ఆర్థిక క్రమశిక్షణ పాటించారు. మిగులు కూడా స్వల్పంగానే ఉంది. ఈ ప్రతిపాదనలను దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. గత బడ్జెట్‌లో రూ.కోటి మిగులుతుందని అంచనా వేయగా.. అదికాస్తా తలకిందులైంది. పైగా, అదనపు బడ్జెట్ కోసం ప్రతిపాదించాల్సి వచ్చింది. ఈసారి మాత్రం కాస్తయినా మిగులు చూపాలని అధికారులు భావిస్తున్నారు. దీనికి తోడు ఏదైనా అద్భుతం జరిగి, భక్తుల నుంచి దండిగా విరాళాలు, కానుకలు వస్తే మాత్రం దేవస్థానం ఆర్థికంగా ఒడ్డున పడుతుంది. ఆ మేరకు కనకధార కురిపించాలని సిరులమాతల్లి శ్రీమహాలక్ష్మిని అధికారులు వేడుకుంటున్నారు.



అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం

మిగులు స్వల్పమే..

మొత్తం రూ.162.55 కోట్లతో 2025–26 బడ్జెట్‌ను రూపొందించారు. ఇందులో వ్యయం రూ.162.13 కోట్లుగా పేర్కొన్నారు. తద్వారా రూ.42 లక్షలు మాత్రమే మిగులు చూపించారు. గత ఏడాది రూ.160 కోట్లతో బడ్జెట్ రూపొందించగా, వ్యయం రూ.159 కోట్లు, మిగులు రూ.కోటిగా అంచనా వేశారు. అయితే, అయితే అంచనాలకు మించి వ్యయం అవడంతో అదనంగా రూ.10 కోట్లు కేటాయించాలని కోరుతూ దేవదాయ శాఖకు సప్లిమెంటరీ బడ్జెట్ ప్రతిపాదించారు. ఇది దేవదాయ శాఖ కమిషనర్ పరిశీలనలో ఉంది.

భక్తుల సేవల్లో కుదింపు లేదు



నూతన బడ్జెట్‌లో కొన్ని వ్యయాల్లో కోత విధించాం. అయినప్పటికీ భక్తులకు అందించే సేవల్లో మాత్రం ఎటువంటి కోతలూ విధించలేదు. ఆ సేవలు యథాతథంగా కొనసాగుతాయి. ఇంజినీరింగ్ నిర్మాణాల విషయంలో కూడా ముందుగా నిర్ణయించినవన్నీ కొనసాగుతాయి.

– వీర్ల సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

2025-26 బడ్జెట్ ప్రతిపాదనలు (రూ.కోట్లలో)

ఆదాయం	
షాపుల లీజులు, లైసెన్సుల ఆదాయం	14.50
సత్రాల అద్దెలు	15.00
హుండీల కానుకలు	20.00
ప్రసాదం విక్రయాలు	40.00
వ్రతాల ఆదాయం	50.00
డిపాజిట్లపై వడ్డీ	6.00
ఇతర ఆదాయ వనరుల ద్వారా	17.00
వ్యయం	
సిబ్బంది జీతభత్యాలు, పెన్షన్లు	45.00
ముడిసరకుల కొనుగోళ్లు	35.00
ఉత్సవాల ఖర్చు	30.00
పారిశుద్ధ్య విభాగం	8.00
ఇంజినీరింగ్ విభాగం	5.00
ఎలక్ట్రికల్ విభాగం	1.00
సీజీఎఫ్, ఆడిట్ ఫీజు వంటి చెల్లింపులు	25.00
ఇతర చెల్లింపులు	13.00

నిత్యాన్నదాన ట్రస్టుకు..

రత్నగిరిపై సత్యదేవుని నిత్యాన్నదాన ట్రస్టుకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్లపై రూ.12 కోట్ల వడ్డీ వచ్చే అవకాశం ఉంది. అయితే, భక్తుల భోజనాల ఖర్చు, ఆ విభాగం సిబ్బంది జీతభత్యాలకు చెల్లింపులు అంతే మొత్తంలో అవుతాయని బడ్జెట్‌లో అంచనా వేశారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు..

సత్యదేవ గో సంరక్షణ ట్రస్టులో డిపాజిట్లపై రూ.కోటి ఆదాయం వస్తుండగా ఆవుల మేత, ఇతర అవసరాలకు రూ.కోటి వ్యయమవుతుందని ప్రతిపాదించారు.

ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ వ్యయాల్లో భారీ కోత

బడ్జెట్ ప్రతిపాదనల్లో ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాల వ్యయాల్లో భారీ కోత విధించారు. గత రెండేళ్లలో ఇంజినీరింగ్ విభాగంలో రూ.20 కోట్లు ఖర్చు చేశారు. దీంతో గత నవంబర్ నెలకే బడ్జెట్ కేటాయింపులు అయిపోయాయి. ఇంకా సుమారు రూ.3 కోట్లు చెల్లింపులు, చేపట్టాల్సిన పనులు మిగిలాయి. దీంతో వీటికి నిధులివ్వాలని సప్లిమెంటరీ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఇంజినీరింగ్ విభాగానికి రూ.5 కోట్లు మాత్రమే కేటాయించారు. ఎలక్ట్రికల్ విభాగానికి కూడా రూ.కోటి మాత్రమే కేటాయించారు.

పేరుకుపోయిన సీజీఎఫ్ బకాయిలు

గత ఏడాది కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) చెల్లింపులు రూ.16 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.2 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగిలిన రూ.14 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆ బకాయిలు, ఈ ఏడాది చెల్లింపులకు కలిపి బడ్జెట్ ప్రతిపాదనల్లో రూ.25 కోట్లు కేటాయించారు.

ఎమ్మెల్సీ బరి.. పార్టీల గురి

- ప్రచార జోరు పెంచిన అభ్యర్థులు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 33 మంది పోటీ

కాకినాడ సిటీ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల **పట్టభద్రుల ఎమ్మెల్సీ** ఎన్నికకు సమయం సమీపి**స్తూండటంతో అభ్యర్థు**లు ప్రచార జోరు పెం**చారు. ఈ నెల 27వ** తేదీన పోలింగ్ జరగనుం**డగా, ఇక 10 రోజులే** గడువు ఉంది. ఈ నేపథ్యం**లో అభ్యర్థులు, వారి** మద్దతుదార్లు ఆయా ఓట**ర్లను నేరుగా కలుస్తూ** ఓటు అభ్యర్థిస్తున్నారు. మేనిఫెస్టోలు సైతం ప్రకటిస్తున్నారు. కొంత మంది సాయంత్రం వేళ గెట్ టుగెదర్లు నిర్వహించి, భోజనాలు ఏర్పాటు చేస్తూ ఓటర్లను వలలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ నుంచి దిడ్ల వీర రాఘవులు, టీడీపీ మద్దతుతో పేరాబత్తుల రాజశేఖర్‌తో పాటు మొత్తం 33 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అతి పెద్ద ఉపాధ్యాయ సంఘమైన యూటీఎఫ్, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, ప్రజాసంఘాలు బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి వీర రాఘవులు పేరాబత్తుల రాజశేఖర్‌కు గట్టి సవాలే విసురుతున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురవుతున్న నేపథ్యంలో తాము బలపరిచిన రాజశేఖర్ విజయం కోసం టీడీపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇప్పటికే ఈ ఎన్నికల కోసం రాష్ట్ర నాయకత్వం జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను ప్రకటించింది. అంతేకాకుండా ప్రతి సచివాలయానికి ఒక ఇన్‌చార్జిని నియమించింది. అలాగే, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కూడా నాయకులకు బాధ్యతలు అప్పగించింది. సచివాలయానికి ఒకరిద్దరు చొప్పున నాయకులు, కార్యకర్తలను నియమించి ప్రచారం సాగిస్తున్నారు.

ప్రతి ఓటరును నాలుగైదుసార్లు కలిసి పోలింగ్ బూత్ వరకూ తీసుకువచ్చే బాధ్యతను వారికి అప్పజెప్పారు. ఇప్పటికే టీడీపీ నాయకులు ఓటర్ల జాబితా చేత పట్టుకుని, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డులు సేకరించే పనిలో పడ్డారు. మరోవైపు పీడీఎఫ్ అభ్యర్థి వీర రాఘవులు ప్రతి పట్టభద్ర ఓటరునూ కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆయనకు మద్దతుగా సీపీఎం, సీపీఐ, టీయూ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ సంఘాల నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఎక్కువ ఓట్లు ఉన్న ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నారు.

న్యూస్‌రీల్

చెందుర్తిలో 4,500 కోళ్ల మృతి



ఫామ్‌లో మృతి చెందిన కోళ్లు

- బర్డ్‌ఫ్లూగా అనుమానం
- శాంపిల్స్ సేకరణ
- అధికారులు అప్రమత్తం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలోని ఓ కోళ్ల ఫామ్‌లో ఒకేసారి 4,500 కోళ్లు మృతి చెందడం కలకలం రేపింది. దీంతో మండలానికి బర్డ్‌ఫ్లూ వ్యాపించిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వివరాలివీ.. చెందుర్తికి చెందిన బి.కృష్ణ కోళ్ల ఫామ్ నిర్వహిస్తున్నాడు. ఇందులో ఐబీ కంపెనీకి చెందిన కోళ్లను ఒక్కో బ్యాచ్‌లో 2,500 చొప్పున సుమారు 10 వేల కోళ్లు పెంచుతున్నాడు. ఆదివారం ఉదయం ఒక్కసారిగా 1,500 కోళ్లు మృతి చెందాయి. దీంతో ఆందోళనకు గురైన కృష్ణ చనిపోయిన కోళ్లను వెంటనే వేరు చేయడం ప్రారంభించారు. కొన్ని గంటల వ్యవధిలోనే సుమారు 4,500 కోళ్లు మృతి చెందాయని అతడు చెప్పాడు. కోళ్ల మృతిపై సంబంధిత కంపెనీకి, పశు సంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించాడు. ఆ కంపెనీ సిబ్బంది వెంటనే వచ్చి, చనిపోయిన కోళ్ల శాంపిల్స్ తీసుకుని వెళ్లారు. గొల్లప్రోలు పశు వైద్యాధికారి హిమజ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. కోళ్ల మృతికి కారణాలను పరిశీలిస్తున్నారు. అన్ని పరీక్షలూ నిర్వహించిన అనంతరం కోళ్ల మృతికి కారణాలను నిర్ధారిస్తామని హిమజ తెలిపారు. బర్డ్‌ఫ్లూపై అనుమానాలు వ్యక్తమవుతూండగా ఆ దిశగా కూడా అన్ని పరీక్షలూ చేస్తామని చెప్పారు.

లోవలో భక్తుల రద్దీ



లోవ ప్రాంగణంలో వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 8 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. పులిహోర, ప్రసాదం, లడ్డూల విక్రయం ద్వారా రూ.1,10,115, పూజా టికెట్లకు రూ.44,930, కేశఖండన శాలకు రూ.9,600, వాహన పూజలకు రూ.5,100, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.21,910, విరాళాలు రూ.48,108 కలిపి మొత్తం రూ.2,39,763 ఆదాయం సమకూరిందని ఈఓ వివరించారు.

రత్నగిరిపై 26న సరస్వతీ పూజ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిన ఈ నెల 26వ తేదీన సరస్వతీ పూజ నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఆ రోజు ఉదయం 9 గంటలకు సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పండితులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం విద్యార్థులు ఉత్తమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని ప్రార్థిస్తూ అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. ఈ పూజల్లో అన్నవరం, చుట్టుపక్కల విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని అధికారులు కోరారు.

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ తల్లి

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా దేవస్థానానికి రూ.1,22,202 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చమురు సంపదపై
హక్కుకు ఉద్యమం

23న కాకినాడలో సదస్సు

కాకినాడ సిటీ: చమురు, సహజ వాయువు, ఖనిజాలు, ప్రకృతి వనరులపై రాష్ట్ర ప్రజల హక్కును కాపాడుకునేందుకు ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఈ నెల 23న కాకినాడలో నిర్వహిస్తున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కాకినాడ ఎస్టీయూ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ సముద్ర తీరంలోని చమురు, సహజవాయు నిక్షేపాలు మనకే దక్కాలని, దీనికోసం, అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడాలని అన్నారు. సహజ వనరుల ఉత్పత్తిలో ఆ రాష్ట్రానికి 50 శాతం కేటాయించాలని 12వ ఫైనాన్స్ కమిషన్ కూడా చెప్పిందన్నారు. దీనిపై రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఏకగ్రీవ తీర్మానాలు చేసినా, గ్యాస్ కేటాయింపులు, ఆదాయంలో సగం పొందలేకపోయామని చెప్పారు. కువైట్, మన దేశంలోని ముంబై కన్నా గోదావరి బేసిన్‌లోనే సహజ వాయు నిల్వలు అధికంగా ఉన్నాయని ముప్పాళ్ల తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ, మన తీరంలోని సహజ వనరులను పాలకులు బడా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. విలేకర్ల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, కోనసీమ జిల్లా కార్యదర్శి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సదస్సు కరపత్రాలను నాయకులు విడుదల చేశారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

రత్నగిరి కిటకిట

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- 2,500 వ్రతాల నిర్వహణ
- రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున రత్నగిరిపై, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు, వారి బంధుమిత్రులకు తోడు ఇతర భక్తులు కూడా అధిక సంఖ్యలో రత్నగిరికి తరలివచ్చి, సత్యదేవుని వ్రతాలాచరించి, స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. ఎక్కువ మంది కార్లు, ఇతర వాహనాల్లో రావడంతో దేవస్థానంలోని పార్కింగ్ స్థలాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు. వ్రతాలు 2,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని అన్న ప్రసాదాన్ని సుమారు 5 వేల మంది భక్తులు స్వీకరించారు. భక్తుల ఏర్పాట్లను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు పర్యవేక్షించారు.

ఘనంగా రథసేవ

ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథ సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకుని వచ్చి టేకు రథంపై వేంచేయించారు. స్వామి, అమ్మవార్లకు పూజల అనంతరం ఈఓ సుబ్బారావు దంపతులు కొబ్బరికాయ కొట్టి రథ సేవను ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల ఘోష నడుమ ఆలయ ప్రాకారంలో రథంపై మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పండితులు నీరాజనం ఇచ్చి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా, రామారాయ కళా వేదిక మీద సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు, సూర్య నమస్కారాలు ఘనంగా నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవారు సోమవారం ముత్యాల కవచాలు ధరించి (ముత్తంగి సేవ) భక్తులకు దర్శనమివ్వనున్నారు.



ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథ సేవ

పడా.. ఏమిటో తేడా!

- జీఓ తప్ప నిధుల ఊసే లేదు
- అధికారుల అజమాయిషీయే అధికం
- ప్రజా వ్యతిరేకత చల్లార్చడానికేనని మిత్రపక్షం విమర్శ

పిఠాపురం: నియోజకవర్గాన్ని పర్యాటక ప్రాంతంగా, ఆధ్యాత్మిక హబ్‌గా అభివృద్ధి చేస్తానంటూ పిఠాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. దీని అమలు కోసం ఒక అధికారిక వ్యవస్థ రూపొందిస్తున్నట్లు ప్రకటించిన ఆయన.. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పడా) ఏర్పాటు చేస్తూ జీఓ విడుదల చేయించారు. అనంతరం ఒక ఐఏఎస్ అధికారితో పాటు 17 మంది సిబ్బందిని నియమిస్తూ మరో జీఓ ఇచ్చారు. పడా కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వ భవనాలను పరిశీలిస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా అసలు పడా వల్ల నియోజకవర్గానికి కలిగే లాభాలు ఏమిటనేది ప్రజలకు అంతు చిక్కడం లేదు. తన నియోజకవర్గానికి సంబంధించి కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసుకున్న సీఎం చంద్రబాబు.. ఇప్పటికే రూ.కోట్లు మంజూరు చేసుకున్నారు. పిఠాపురంలో మాత్రం పడా ఏర్పాటు జీఓలకే పరిమితమైంది. ఇప్పటి వరకూ నయాపైసా నిధులు రాలేదు.

ఆయన రాని లోటు తీర్చడానికేనా..

సార్వత్రిక ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచీ పవన్ కల్యాణ్ గత ఎనిమిది నెలల్లో తన సొంత నియోజకవర్గం పిఠాపురంలోని ప్రజలకు ఎనిమిది రోజులు కూడా అందుబాటులో లేరు. ఇన్‌చార్జితో వ్యవహారాలు చక్కబెడుతున్నారు. దీంతో, పవన్ తీరుపై ఇక్కడి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనిని చల్లార్చే ప్రయత్నంలో భాగంగానే పడా ఏర్పాటు చేశారని మిత్రపక్షమైన టీడీపీ విమర్శిస్తోంది. అయితే, పవన్ ఇక నుంచి అధికారులతో పాలన సాగించనున్నారని, దీనివలన అభివృద్ధి జరుగుతుందని జనసేన వర్గీయులు చెప్పుకొంటున్నారు. ఆయన ఎక్కడో ఉండి ఇక్కడ ఎవరితోనో పాలన చేయించడమేమిటో అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు.

కౌడాదే పెత్తనం

ఇప్పటికే ఈ ప్రాంతమంతా కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) పరిధిలో ఉంది. ఈ రీత్యా పడా అధికారాలు చాలా పరిమితంగానే ఉండనున్నాయి. దీనికి కౌడా స్థాయిలో అధికారాలు ఉండవని చెబుతున్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు కేంద్రం నుంచి నిధులు వస్తూంటాయి. కానీ పడాకు ఆ అవకాశం లేదని సంబంధిత జీఓ చెబుతోంది. కేవలం నియోజకవర్గానికి వచ్చే నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల పర్యవేక్షణ, పేదరిక నిర్మూలన చర్యలు, అధికారుల బదిలీలు, పోస్టింగ్‌ల వంటి వాటి వరకూ మాత్రమే పడా అధికారాలు పరిమితమని అంటున్నారు. కౌడా ఏర్పాటైనప్పటి నుంచీ పిఠాపురం ప్రాంత ప్రజలు ఇళ్లు, స్థలాలు, భూముల కన్వర్షన్లు, షాపుల వంటి అనుమతులను అక్కడే తీసుకుంటున్నారు. ఇప్పుడు పడా వచ్చినప్పటికీ ఈ పనులు మాత్రం కౌడా పరిధిలోనే చేయించుకోవాల్సి ఉంటుంది. సంబంధిత రుసుములు ఆ సంస్థకే చెల్లించాలి. అంటే పిఠాపురం ప్రాంత ఆదాయం కూడా కౌడాకే వెళ్తుంది. ప్రస్తుతం మున్సిపాలిటీలు, గ్రామాల నుంచి వివిధ రూపాల్లో కౌడాకు వస్తున్న నిధుల్లో కొంత మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి ఆయా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు అందిస్తూంటుంది. అదే పరిస్థితి ఇప్పుడూ కొనసాగుతుందని, అందువలన పడా వచ్చినా పెత్తనం కౌడా చేతిలోనే ఉంటుందని చెబుతున్నారు.



పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్

అలాగైతే ఉపయోగమేమిటి?



పడా వచ్చినా కౌడాలోనే పనులు చేయించుకోవాల్సి వస్తే పిఠాపురం ప్రజలకు పెద్దగా కలిసి వచ్చేదేముంటుంది? ఇప్పటికే నియోజకవర్గ ప్రజలు వివిధ పనులపై కాకినాడలోని కౌడా కార్యాలయానికి వెళ్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. అందువలన పడా సేవలను విస్తృతపరచాలి.

– కొండేపూడి శంకరరావు, సామాజికవేత్త, పిఠాపురం

కొన్ని ఇబ్బందులు మాత్రమే తగ్గుతాయి



పడా వల్ల కొన్ని ఇబ్బందులు మాత్రమే తగ్గుతాయి. ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తే కౌడాకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కొన్ని పనులు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లోనే పూర్తవుతాయి. అయితే, పూర్తిగా అన్ని పనులూ పడా ద్వారా జరిగే అవకాశాల్లేవు.

– కనకారావు, మున్సిపల్ కమిషనర్, పిఠాపురం

నేడు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

- తునిలో భారీగా బందోబస్తు
- ప్రతిష్టంభనకు నేటితో తెర!

తుని: మున్సిపల్ వైస్ చైర్మన్–2 ఎన్నిక సోమవారం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మెజారిటీ సభ్యులు ఉన్నప్పటికీ ఈ ఎన్నికకు టీడీపీ కూడా సమాయత్తమైంది. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 30కి 30 వార్డులను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రెండో వైస్ చైర్మన్ పదవికి అవకాశం కల్పించారు. ఈ మేరకు అప్పట్లో వైఎస్సార్ సీపీకి చెందిన పామర్తి మహేష్ వైస్ చైర్మన్–2గా ఎన్నికయ్యారు. రెండేళ్ల అనంతరం ఆయన రాజీనామా చేయడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్–2 ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 3, 4 తేదీల్లో వైస్ చైర్మన్ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ టీడీపీ శ్రేణులు దౌర్జన్యం చేసి, ఎన్నిక జరగకుండా అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించగా సోమవారం మరోమారు ఎన్నిక నిర్వహించేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో 15 రోజులుగా నెలకొన్న రాజకీయ ప్రతిష్టంభనకు తెర పడనుంది. ఇదిలా ఉండగా వైఎస్సార్ సీపీకి చెందిన 10 మంది కౌన్సిలర్లను భయపెట్టి, ప్రలోభపెట్టి చేర్చుకున్న టీడీపీ.. వైస్ చైర్మన్–2 పదవికి పోటీ చేయనుంది. గతంలో చోటు చేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేవలం కౌన్సిల్ సభ్యులు, మీడియాను మాత్రమే కౌన్సిల్ హాలులోనికి అనుమతిస్తామని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

చికెన్ షాపులు వెలవెల


కాకినాడలో మూతపడిన చికెన్ షాపులు

- బర్డ్‌ఫ్లూ కలకలంతో దుకాణాల మూసివేత
- మాంసాహారం కొనుగోలుకు ప్రజలు దూరం
- వ్యాపారుల ఆదివారం ఆశలు గల్లంతు

ఆలమూరు/కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం రేగడంతో మాంసాహారం మార్కెట్ పూర్తిగా కుదేలైంది. మాంసాహారాన్ని ఉడికించి తింటే వైరస్ ప్రభావం ఏమీ ఉండదని పశుసంవర్ధకశాఖ, వైద్యారోగ్యశాఖ చెబుతున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. కొద్ది రోజులు ఈ రెండింటికి దూరంగా ఉంటే బెటర్ అనే అభిప్రాయం వినియోగదారుల్లో కన్పిస్తోంది. బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావం అంతగా లేకపోవడంతో ఆదివారమైనా వ్యాపారం సజావుగా సాగుతుందని భావించిన చికెన్, మటన్ వ్యాపారులకు నిరాశే మిగిలింది. దీంతో మాంసాహారాన్ని కొనుగోలు చేసే వినియోగదారుల లేక వ్యాపారులు గగ్గోలు పెట్టారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సుమారు రెండు వేల మటన్, చికెన్ దుకాణాల ద్వారా వారం తపు రోజైన ఆదివారం సుమారు వెయ్యి మేకలతో పాటు దాదాపు 50 వేల బ్రాయిలర్, ఫారం కోళ్ల మాంసం విక్రయాలు జరుగుతుంటాయి. మిగతా రోజుల్లో మాత్రం అందులో సుమారు 40 శాతం మాత్రమే వ్యాపారం జరుగుతుంది. కాని బర్డ్ ఫ్లూ వల్ల ఈ ఆదివారం ఆశించినంత స్థాయిలో అమ్మకాలు జరగకపోవడంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొన వలసిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కిరాణా షాపులు, హోల్‌సేల్ దుకాణాల్లో గుడ్లు కొనుగోలు చేసేందుకు సైతం వినియోగదారులు వెనకడుగు వేస్తున్నారు.

గణనీయంగా పడిపోయిన చికెన్ విక్రయాలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా బర్డ్ ఫ్లూ వైరస్ కల కలం అధికంగా ఉన్నా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మాత్రం ఆ ప్రభావం లేదు. అయినా జిల్లావ్యాప్తంగా బ్రాయిలర్, ఫారం కోళ్ల ధరలు కొంతమేర తగ్గినా వినియోగదారులు మాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఇప్పటి వరకూ చికెన్ కేజీ ధర రూ.300 నుంచి రూ.180కి పడిపోయినా వ్యాపారులకు ప్రయోజనం కలిగించలేదు. అమ్మకానికి తెచ్చిన కోళ్లు అలాగే ఉండిపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉత్పన్నమైంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు కూడా మూతబడటంతో చికెన్ వ్యాపారానికి కోలుకోని దెబ్బ తగిలిందనే అభిప్రాయం వ్యాపారుల్లో వ్యక్తమవుతోంది.

మటన్ విక్రయాలపై అదే ప్రభావం

బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావం చికెన్ విక్రయాలతో పాటు కొంత మేర మటన్ విక్రయాలపై పడింది. మటన్ ధర అధికంగా ఉండటంతో పాటు ఈ ఆదివారం పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండటం కూడా మటన్ విక్రయాలపై ప్రభావం పడిందని తెలుస్తోంది. దాదాపుగా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మటన్ అమ్మకాలు భారీగా తగ్గిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మటన్ భారీస్థాయిలో నిల్వ ఉండిపోవడంతో నష్టాలు తప్పవని వారు ఆవేదన చెందుతున్నారు. రెస్టారెంట్లలో చికెన్ స్థానంలో మటన్ ఐటమ్స్ తయారు చేస్తున్నా ఆదరణ అంతంత మాత్రంగానే ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.

42 ఆర్‌ఆర్‌టీ బృందాల ఏర్పాటు

కాకినాడ జిల్లాలో పరిస్థితిని ఎదుర్కొనేందుకు వీలుగా పశుసంవర్ధకశాఖ 21 మండలాల్లో మండలానికి రెండు బృందాలు చొప్పున 42 ఆర్‌ఆర్‌టీ బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో పశువైద్యాధికారితో పాటు ఇద్దరు కాంపౌండర్‌లు, ఇద్దరు అసిస్టెంట్‌లు కలిపి మొత్తం ఐదుగురు సభ్యులు ఉంటారు. పీపీఈ కిట్స్, మాస్క్‌లు, స్ప్రేయింగ్ మందులు అందుబాటులో ఉంచారు.

కోళ్లు, మాంసం వివరాలు

	పాత ధర (కేజీ) రూపాయల్లో..	కొత్త ధర (కేజీ) రూపాయల్లో..
బ్రాయిలర్ (లైవ్)	120	85
ఫారం (లైవ్)	80	50
బ్రాయిలర్ చికెన్	300	180
ఫారం చికెన్	200	130
కోడి గుడ్లు	07	4.50

జాగ్రత్తలు తీసుకుంటే సరి

- కొన్ని జాగ్రత్తలు పాటిస్తే యథేచ్ఛగా మాంసాహారాన్ని భుజించవచ్చు.
- ఇంట్లో హైజిన్ పాటించాలి. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- వంట చేసుకునే ముందు కచ్చితంగా కిచెన్ రూమ్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- పచ్చి మాంసం, కోడిగుడ్లు, చికెన్ పదార్థాలను వేర్వేరుగా నిల్వ చేసుకోవాలి.
- మాంసాహారాన్ని 75 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో వేడి చేసి తినడం ద్వారా వైరస్‌ను నశింపజేయవచ్చు.
- ముడి మాంసం, సగం ఉడికించిన కోడి గుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తినరాదు.
- మాంసాహారాన్ని ఉడకపెట్టిన తరువాత బయటకు తీసి శుభ్రపరచుకుని వండుకోవాలి.

అపోహలు వీడండి

జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ వైరస్ కేసు నమోదు కానందున మాంసాహారాన్ని భుజించవచ్చునని జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకూ చెబుతున్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ 30 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు మించితే జీవించే అవకాశం లేదని వివరిస్తున్నారు. ఉడికించిన మాంసాహారాన్ని తింటే ఏవిధమైన వ్యాధులు దరి చేరవని, బర్డ్ ఫ్లూ అసలు సోకదంటూ జిల్లా పశుసంవర్ధకశాఖ, వైద్యారోగ్యశాఖ గ్రామాల్లో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి వివరిస్తున్న సంగతిని ప్రజా ప్రతినిధులు తెలియజేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేయమని ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన సంగతిని గుర్తు చేస్తున్నారు. శీతాకాలం ముగిసి వేసవికాలంలోకి ప్రవేశించేటప్పుడు సాధారణంగా బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అపోహలు వీడండి-యదేచ్ఛంగా మాంసాహారం భుజించండి అంటూ స్వచ్ఛంద సంస్థలు, పౌల్ట్రీ యజమానులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

ధరలు తగ్గినా వ్యాపారం లేదు



బర్డ్ ఫ్లూ వైరస్ నిర్ధారణ కాకపోయినా ప్రచార మాధ్యమాల్లో అసత్య ప్రచారం జరుగుతున్నందువల్ల చికెన్, కోడిగుడ్లు ధరలు తగ్గినా ఆ మేరకు వ్యాపారం జరగలేదు. వినియోగదారులు కూడా మాంసాహారంపై అంతగా ఆసక్తి చూపకపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. చికెన్ వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– గాద శివ, చికెన్ వ్యాపారి, ఆలమూరు

మటన్ విక్రయాలు పడిపోయాయి



బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందుతుందంటూ పుకార్లు సృష్టించడం వల్ల చికెన్ విక్రయాలతో పాటు మటన్ విక్రయాలు కూడా దారుణంగా పడిపోయాయి. రెస్టారెంట్లలో కూడా చికెన్‌కు డిమాండ్ తగ్గగా ఆమేరకు మటన్ విక్రయాలు పెరగలేదు. మార్కెట్‌లో కొనసాగుతున్న అనిశ్చితి వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం.

– రొట్టా సతీష్, మటన్ వ్యాపారి, రావులపాలెం

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న ముగ్గురికి రిమాండ్

గండేపల్లి: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. రాజవొమ్మంగికి చెందిన కెకె సాగర్, మాడుగులకు చెందిన కేపీ కుమార్, సామర్లకోటకు చెందిన పీకే కృష్ణ కలిసి గంజాయిని తరలిస్తుండగా మండలంలోని నీలాద్రిరావుపేట నుంచి జెడ్ రాగంపేట వెళ్లే మార్గంలో గల వర్మి కంపోస్ట్ వద్ద వీరిని గండేపల్లి ఎస్సై యువీ శివ నాగబాబు సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 4.3 కేజీల గంజాయితోపాటు ఒక మోటార్ సైకిల్, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించగా రిమాండ్ నిమిత్తం ముద్దాయిలను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు తెలియజేశారు. కిర్లంపూడికి చెందిన మరో ముద్దాయి పరారీలో ఉన్నాడని అతనిని త్వరలోనే పట్టుకోనున్నట్టు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు: తొగుమ్మి గ్రామానికి చెందిన కొనగళ్ల రాధ అనే మహిళ తనను భర్త,అత్తలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదుపై ఆదివారం కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. తనకు వేములూరు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌తో వివాహం కాగా తన భర్త వేరే యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. తన భర్తకు అత్త వీర వెంకట లక్ష్మి సైతం వత్తాసు పలుకుతున్నట్టు పేర్కొంది. భర్త దుర్గాప్రసాద్, అత్త వీర వెంకటలక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీఎస్ఎల్‌కు మృతదేహం అందజేత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): లయన్స్ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు ఎంవీఆర్ మోహన్‌కుమార్ తల్లి సీతామహాలక్ష్మి మరణించడంతో ఆమె మృతదేహాన్ని జీఎస్ఎల్ వైద్య కళాశాలకు మెడికల్ విద్యార్థుల పరిశోధన నిమిత్తం ఆదివారం అందజేశారు. ముందుగా ఆమె నేత్రాలను బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు అందజేసి అనంతరం రాజానగరంలో గల వైద్యకళాశాలకు తరలించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌ను డాక్టర్ బాదం బాలకృష్ణ, క్లబ్ కార్యదర్శి పీవీఎస్ కుమార్, కోశాధికారి నేరేళ్ల మురళీకృష్ణ, డి.రామసుబ్రమ్మణ్యం అభినందించారు.

ఉత్సాహంగా హాకీ పోటీలు


ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలలో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న సివిల్ సర్వీసెస్ ఆల్ ఇండియా హాకీ పోటీలు ఆదివారం రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. ఆర్ఎస్‌బీ (హైదరాబాద్), ఆర్ఎస్‌బీ (కొచ్చి) మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్‌బీ హైదరాబాద్ జట్టు 8-1 స్కోర్ తేడాతోను, ఆర్ఎస్‌బీ(చండీఘర్), ఆర్ఎస్‌బీ (ముంబయి) మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్‌బీ ముంబయి 5-1 స్కోర్ తేడాతోను, ఆర్ఎస్‌బీ (సిమ్లా), ఆర్ఎస్‌బీ (రాయ్‌పూర్) మధ్య నిర్వహించిన మ్యాచ్‌లో ఆర్ఎస్‌బీ రాయ్‌పూర్ 6-2 స్కోర్ తేడాతో విజయం సాధించాయి. ఛత్తీస్‌గఢ్ సెక్టార్, గుజరాత్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్టార్ 13-0 స్కోర్‌తో గెలుపొందింది. మధ్యప్రదేశ్, తెలంగాణ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ 4-3 స్కోర్ తేడాతోను, కేరళ సచివాలయం, ఢిల్లీ సచివాలయం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు 9-0 స్కోర్ తోను, పాండిచ్చేరి , ఒడిశా సచివాలయాల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా జట్టు 6-0 స్కోర్‌తోను, గోవా , మహారాష్ట్ర సచివాలయాల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 18-0 స్కోర్‌తోను విజయం సాధించాయి. శ్రీకృష్ణ కోలాట బృందం, శ్రీభరత్ లిఖిత ఆర్కెస్ట్రా, ఆర్ టెక్నో రాక్ బ్యాండ్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వ్యక్తిని కిడ్నాప్ చేసి దోపిడీ

పిఠాపురం: దారిలో గాయాలతో ఉన్న వ్యక్తికి సాయం చేసేందుకు ఆగిన ఒక వ్యక్తిని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేసి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అతనిపై దాడి చేసి అతని దగ్గర ఉన్న నగదు దోపిడీ చేసిన ఘటన గొల్లప్రోలులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గొల్లప్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11తేదీ రాత్రి పదిన్నర గంటల సమయంలో గొల్లప్రోలు దేవినగరానికి చెందిన ఉమ్మడి గంగాధర్ టైల్స్ పని చేసుకుని సురేష్ కల్యాణ మండపం మీదుగా దేవినగరంలోని తన ఇంటికి వెళుతున్నాడు. దారిలో అప్పటికే అక్కడ ఇరువర్గాలు కొట్లాడుకుంటుండగా, పిఠాపురం రథాలపేటకు చెందిన ఒక వ్యక్తికి గాయం అవడంతో మానవత్వంగా అతనికి సాయం చేయడానికి ఆగి నీరు అందిస్తున్నాడు. ఇంతలో పిఠాపురం రథాలపేటకు చెందిన పెద్ద, చిన్న, ఆకాష్ లతో పాటు గొల్లప్రోలుకు చెందిన గణేష్ ,అంజి బాధితుడు ఉమ్మడి గంగాధర్‌ను బలవంతంగా బండిమీద ఎక్కించుకుని పిఠాపురం రథాలపేట ఏరియాలో ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ బీరు సీసాలతో, ఇనుపరాడ్లతో బాధితుడిపై దాడి చేసి గాయపరిచి అతని జేబులో ఉన్న రూ.3,800లను దోచుకున్నారు. అతనిని అదే రోజు రాత్రి మూడు గంటల సమయంలో గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద వదిలివేసి వెళ్లిపోయారు. గాయాలతో ఉన్న బాధితుడు నడుచుకుంటూ ఇంటికి చేరుకుని జరిగిన విషయం బంధువులకు చెప్పాడు. ఈ ఘటనపై బాధితుడు ఆదివారం గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రమాద స్థలిలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తుని: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి గాయాలతో బయటపడ్డ ఘటన 16వ నంబరు జాతీయ రహదారిపై తుని వద్ద ఆదివారం జరిగింది. వివరాల్లోకెళితే..విజయనగరం జిల్లా వేపాడ మండలం, వేలుపర్తికి చెందిన గోకడ రవికుమార్(25), అనకాపల్లి జిల్లా రాంబిల్లికి చెందిన నాగిరెడ్డి కిల్లాడి ద్విచక్ర వాహనంపై అన్నవరం వచ్చారు. తిరుగు ప్రయాణంలో స్థానిక డీమార్టు సమీపంలో ఉన్న హవేలి రెస్టారెంటు దగ్గర నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న గోకడ రవికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా అతనితో ప్రయాణిస్తున్న నాగిరెడ్డి కిల్లాడి గాయాలతో బయట పడ్డాడు. పట్టణ సీఐ గీతా రామకృష్ణ ఘటనా స్థలిని పరిశీలించారు. యువకుడు మోటారు వాహనాన్ని నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడపడం వల్ల ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

డాబాపై నుంచి పడి వ్యక్తి...


స్వామినాయుడు మృతదేహం

పి.గన్నవరం: ప్రమాదవశాత్తూ డాబాపై నుంచి కింద పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన పి.గన్నవరంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైవీపాలెంనకు చెందిన యర్రంశెట్టి వీరా స్వామినాయుడు (55) పి.గన్నవరం శివాలయం సమీపంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. శనివారం రాత్రి డిష్ యాంటెన్నాను సరిచేసేందుకు డాబాపైకి ఎక్కాడు. ఈ క్రమంలో మెట్లపై ఉన్న చెత్తను తీసి కిందకు పడేస్తుండగా అదుపుతప్పి స్వామినాయుడు కిందకు పడిపోయాడు. తలకు గాయాలపాలైన అతడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో అమలాపురంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతదేహానికి అమలాపురం ఏరియా ఆస్పత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం


కృష్ణ మృతదేహం

కొవ్వూరు: పట్టణ శివారున గామన్ ఇండియా టోల్ ప్లాజా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి మృతిచెందిన వ్యక్తి సీతానగరం మండలం ములగాలలంక గ్రామానికి చెందిన కనమరెడ్డి కృష్ణ(50)గా గుర్తించారు. శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డు పక్కన పడి ఉన్న విషయం తెలిసిందే. ఆదివారం కుటుంబ సభ్యులు సమాచారం తెలుసుకుని మృతదేహాన్ని గుర్తించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

బైకులు ఢీకొని వ్యక్తి మృతి


సత్యనారాయణ మృతదేహం

శంఖవరం: కత్తిపూడి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం పోలీసుల వివరాలు ప్రకారం గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన నక్కా సత్యనారాయణ(50) కత్తిపూడిలో ఒక కార్యక్రమం నిమిత్తం బైక్‌పై వచ్చి తిరిగి చెందుర్తి వెళ్తుతుండగా వజ్రకూటం సమీపంలో ఎదురుగా జగ్గంపేట మండలం కాట్రపల్లి నుంచి కత్తిపూడి వస్తున్న బైక్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు అన్నవరం ఎస్సై హరిబాబు తెలిపారు.

విద్యుత్ వైర్లు తెగిపడి వ్యవసాయ కూలీ...


నరేష్ మృతదేహం

నిడదవోలు రూరల్: విద్యుత్ వైర్లు తెగిపడి అరటితోటలో పురుగుమందు స్ప్రే చేస్తున్న వ్యవసాయ కూలీ కరెంట్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు ఆదివారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన దేశాబత్తుల నరేష్(35) పందలపర్రు శివారులోని అరటితోటలో ఆదివారం ఉదయం పురుగుమందు స్ప్రే చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ వైర్లు తెగి మీద పడటంతో కరెంట్‌షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీరబాబు చెప్పారు. కరెంట్‌షాక్‌కు గురై మృతిచెందిన దళిత యువకుడు నరేష్ కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారాన్ని విద్యుత్‌శాఖ అధికారులు ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. నరేష్ భార్య మౌనికకు ప్రభుత్వం తరుపున ఉపాధి కల్పించాలన్నారు.

చికిత్స పొందుతూ సర్పంచ్ మృతి


రామకృష్ణ (ఫైల్)

పి.గన్నవరం: ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి తాడేపల్లిగూడెం నుంచి మోటార్ సైకిలుపై ఇంటికి వస్తూ బెల్లంపూడి వద్ద ప్రమాదానికి గురైన ఎల్.గన్నవరం గ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణ (46) రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తాడేపల్లిగూడెం నుంచి వస్తున్న రామకృష్ణ బెల్లంపూడి వద్ద ప్రమాదవశాత్తూ పంట బోదెలో పడిపోయారు. తీవ్ర గాయాలపాలైన రామకృష్ణను స్థానికులు పంట బోదెలోనుంచి బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సర్పంచ్‌కు భార్య సీతారత్నం, కుమారుడు పవన్ వెంకట సాయి, కుమార్తె రాజేశ్వరి ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు.

వక్క.. లాభాలు పక్కా


దుర్గాడలో సాగు చేసిన పోక తోట

- ఒక్కసారి సాగు చేస్తే వందేళ్ల ఆదాయం
- సేంద్రియ విధానంలో ప్రయోగాత్మకంగా సాగు

జిల్లాలో పోకచెక్క సాగు	15.20 హెక్టార్లు
సాగు చేస్తున్న రైతులు	50 మంది
సాగవుతున్న మండలాలు	5


పిఠాపురం: ప్రకృతి వ్యవసాయం పరవళ్లు తొక్కుతుందనడానికి నిదర్శనమే కొత్త పంటల సాగు. వైవిధ్యమైన వ్యవసాయ విధానాలను రైతులు అవలంబిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఎప్పుడూ ఎక్కడా సాగు చేయని పంటలపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే జాజికాయ, జాపత్రి వంటి అరుదైన పంటలను పరిచయం చేసిన స్థానిక రైతులు ఇప్పుడు పోకచెక్క సాగు చేపట్టారు. ఒక్కసారి పంట వేస్తే దీర్ఘకాలం దిగుబడులు ఇచ్చే సాగు పోక చెక్క. రసాయనక ఎరువులు, క్రిమిసంహారక మందులతో పని లేకుండా తక్కువ నీటి వసతి ఉన్నా సాగు చేసుకునే ఈ పంటను కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో రైతులు ప్రయోగాత్మకంగా చేపట్టారు. పంట సాగు చేసిన నాలుగేళ్ల నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. దిగుబడి ప్రారంభం నుంచి వందేళ్ల వరకు ఎటువంటి పెట్టుబడి లేకుండా నిరంతరాయంగా ఆదాయం పొందే అవకాశం వక్క సాగులో మాత్రమే ఉంది. ఒక ఎకరం పొలంలో 450 నుంచి 500 వరకు మొక్కలు నాటుతున్నారు. పంట నాటిన నాలుగేళ్ల అనంతరం ఎకరానికి రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. ఒక్కో చెట్టు నుంచి గరిష్ఠంగా సుమారు 100 కేజీల వరకు పోకచెక్క కాయల దిగుబడి వస్తుంది. దీని నుంచి 30 శాతం వరకు పోకచెక్క వస్తుంది. మార్కెట్‌లో ధరలు బాగుంటే రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. విత్తన కాయల నుంచి మొక్కలను పెంచి తోటలు వేస్తుంటారు. ఈ మొక్కలకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయాల్సిన పని లేదు. కేవలం అవసరమైనప్పుడు నీరు పెట్టుకోవడం, సేంద్రియ ఎరువులు ఏడాదికి రెండు మూడు సార్లు వేసుకుంటే సరిపోతుంది. ఏడాదిలో వక్క దిగుబడి వచ్చే నాలుగు నెలలు మాత్రమే రైతుకు పని ఉంటుంది. మిగిలిన ఎనిమిది నెలలు చెట్ల సంరక్షణ చూసుకోవాల్సి ఉంటుంది. తక్కువ పెట్టుబడితో సేంద్రియ పద్ధతిలో సాగుకు అనుకూలంగా ఉండడంతో స్థానిక రైతాంగం వక్క తోటల పెంపకం చేపట్టింది. శీతల ప్రాంతాల్లో మాత్రమే పండే ఈ పంటను ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే కాకినాడ జిల్లాలోని తొండంగి, రౌతులపూడి, జగ్గంపేట, ప్రత్తిపాడు, గొల్లప్రోలు మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టారు.

సాగు బాగుంది

ఇప్పటి వరకు పలు రకాల వాణిజ్య పంటలు సాగు చేశాను. అయితే కాలానుగుణంగా వచ్చే వ్యాధులు, తెగుళ్లు పంటలను తీవ్రంగా దెబ్బతీయడంతో నష్టాలు చవి చూడాల్సి వచ్చింది. రెండేళ్ల కిత్రం ఎకరం పొలంలో చెక్క సాగు ప్రారంభించాను. మరో ఏడాదిన్నరలో పంట ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతానికి అనువైనది కాకపోయినా ప్రస్తుతం పంట బాగానే ఉంది.

– దేశినీడి నాగేశ్వరరావు, చెక్క సాగు చేసిన రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

రైతులు ఆసక్తి చూపుతున్నారు



తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే చెక్క సాగుకు స్థానిక రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత రెండేళ్లుగా జిల్లాలో పోకచెక్క సాగు చేపట్టారు. ప్రస్తుతం మొక్కలు బాగానే ఎదుగుతున్నాయి. కొన్నింటి దిగుబడి ప్రారంభమైంది. మిగిలిన చోట్ల దిగుడులు బాగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

– ఎస్.మల్లిఖార్జునరావు, ఉద్యానశాఖాధికారి, కాకినాడ

క్రీడలతో ఉన్నత శిఖరాలు

- రావులపాలెంలో ప్రారంభమైన రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలు


ప్రారంభ మ్యాచ్‌లో తలపడుతున్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల బాలుర జట్లు

రావులపాలెం: క్రీడలతో విద్యార్థులు ఉన్నత స్థానాలను చేరుకోవాలని డాన్‌బాస్కో ప్రిన్సిపాల్ ఐ.బల్తాజార్ అన్నారు. రాష్ట్ర స్థాయి పదో జూనియర్ నెట్ బాల్ పోటీలు ఆదివారం డాన్‌బాస్కో స్కూల్ ఆవరణలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను బల్తాజార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అండర్ -19 విభాగంలో 13 జిల్లాలకు చెందిన బాల బాలికలు సుమారు 350 మంది నెట్‌బాల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు నెట్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ సెక్రటరీ పల్లా శ్రీను తెలిపారు. లీగ్ కం నాకౌట్ విధానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి అశోక్ రెడ్డి తెలిపారు. బాలుర, బాలికల విభాగాల్లో 11 జట్లు లీగ్ దశలో పాల్గొంటాయన్నారు.